క్లుప్తంగా

'దళారీ వ్యవస్థ అరికట్టేందుకే టోకెన్లు'

ఇంద్రవెల్లి: వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో దళారీ వ్యవస్థను అరికట్టేందుకే టోకెన్లు జారీ చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. పంట కొనుగోలు విషయంలో రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలకు మోసపోవద్దు'



ప్రచారం చేస్తున్న మాజీ సర్పంచ్

ఇచ్చోడ: కాంగ్రెస్ హామీలకు మహారాష్ట్ర ప్రజలు మోసపోవద్దని, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో నిమ్మించి మోసం చేసిందని ముఖరా(కె) మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్ అన్నారు. బుధవారం కిన్వట్ నియోజకవర్గంలోని పాటోదా, ఇంజెగావ్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. తెలంగాణలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి విస్మరించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 11 నెలలైనా. ఇప్పటికీ హామీలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని సూచించారు. వారి వెంట ముఖరా(కె) గ్రామస్తులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టాలి

తాంసి: ప్రతీ పోలింగ్ బూత్ నుంచి బీజేపీ సభ్యత్వం నమోదు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు తాటిపెల్లి రాజు సూచించారు. బుధవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేయించారు. ప్రతీ బూత్ నుంచి రెండు వందలకు పైగా సభ్యత్వాలు తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, సదానంద్, సుభాష్, దేవేందర్, నారాయణ, పొచ్చన్న, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

బోథ్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని ఎంఈవో కుమ్మరి పోశెట్టి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(బాలికలు)లో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ మండలానికి రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్, యూఎస్ఏఐడీ వారి సహకారంతో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కథల పుస్తకాలు, పఠన సామగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీకొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు రజిత, అనసూయ, భైరి సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: ఆరోగ్యం ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. బుధవారం మండలంలోని తర్నం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఏఎన్ఎంలు గంగామణి, శ్యామల ఆనంద పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఇంద్రవెల్లి: 40 సంవత్సరాలుగా టైలర్ వృత్తినే నమ్ముకుని జీవితాన్ని కొనసాగిస్తున్న టైలర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బుధవారం ఇంద్రవెల్లి టైలర్ల యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మరే కాంరాజ్, సునీల్, టైలర్ యూనియన్ సభ్యులు గజానంద్, కవిత, పంచపుల పాల్గొన్నారు.

రంగుల బడి.. రమణీయ చిత్రాలు

- ప్రహరీతోపాటు తరగతి గదుల్లో అందమైన బొమ్మలు
- విద్యార్థులకు విజ్ఞానం అందించేలా పెయింటింగ్స్
- స్వయంగా గీసిన ఉపాధ్యాయురాలు కవిత
- ఆకట్టుకుంటున్న తాంసి ప్రభుత్వ పాఠశాల



బొమ్మలు గీస్తున్న ఉపాధ్యాయురాలు కవిత

తాంసి: ఒక చిత్రం వేయి పదాలతో సమానమంటారు. చిత్రాలతో బోధించడం ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. పుస్తకాలలో చదివితే కానీ అర్థం కానీ పాఠాలను సైతం చిత్రాల రూపంలో సులువుగా నేర్చుకోవచ్చు. చిన్నారులతే ఇష్టంగా ఆడుతూ పాడుతూ నేర్చుకునే అవకాశం ఉంటుంది. చిత్రాల ద్వారా చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయా విలువలు, తదితర అంశాలు అర్థం అవుతాయి. బోధనకు అనుగుణంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రజలు, దాతల సహకారంతో రంగురంగుల బొమ్మలను గీయించారు. రంగుల చిత్రాల నడుమ విద్యార్థులు ఉత్సాహంగా చదివే విధంగా పాఠాలను చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల గదులతో పాటు ఆవరలో బొమ్మలతో కనిపించడంతో విద్యార్థులను ఆకట్టుకుంటుంది.

దాతల సహకారంతో..

పాఠశాల ఆవరణలో ఉన్న గోడలు, తరగతి గదుల్లో చిత్రాలు గీసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. హెచ్ఎం ఆశారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తనవంతు సాయం అందించడంతో పాటు గ్రామస్తులు, యువకులు, ఉపాధ్యాయులు తలకొంత డబ్బులు పోగు చేశారు. దాదాపుగా రూ.60 వేలకు పైగా ఖర్చు చేసి పాఠశాలకు రంగులతో పాటు చిత్రాలను వేయించారు. జంతువులు, వారాల పేర్లు, పండ్లు, కూరగాయాలు, నెలల పేర్లు, పద్యాలు, తెలుగు అక్షరాలు బొమ్మలను వేయడంతో పాటు పేర్లు రాశారు.

ఉపాధ్యాయురాలి చొరవతో..

బదిలీల్లో భాగంగా గత నాలుగు నెలల క్రితం తాంసి పాఠశాలకు జిల్లా కేంద్రం నుంచి కవిత అనే ఉపాధ్యాయురాలు బదిలీపై వచ్చారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు ప్రత్యేక చొరవతోనే పాఠశాల గదులతో పాటు ఆవరణ పూర్తిగా చిత్రాలతో నిండిపోయింది. పుస్తకాల్లో ఉన్న పాఠాలను విద్యార్థులకు బోధిస్తే సరిపోదని ఆకట్టుకునేలా బోధన చేయాలని కవిత ఉపాధ్యాయురాలు భావించారు. తనకున్న కళా నైపుణ్యంతో పాఠశాలలో వివిధ రకాల బొమ్మలను స్వయంగా ఉపాధ్యాయురాలు గీశారు. దాతలు, హెచ్ఎం ఆశారెడ్డి అవసరమైన రంగులను సమకూర్చగా విద్యార్థుల కోసం ఉపాధ్యాయురాలు కవిత 20 రోజుల పాటు శ్రమించి తన కళా నైపుణ్యంతో పాఠశాల ప్రహరీతో పాటు గోడలపై పెయింటింగ్ వేశారు.

విద్యార్థులకు అవగాహన

బొమ్మలు గీసి వాటి ద్వారా చదువు బోధించడంతో విద్యార్థులకు త్వరగా అవగాహన పెరుగుతోంది. సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంది. బొమ్మలు ఆకట్టుకునే విధంగా ఉండడంతో ద్వారా విద్యార్థులకు ఆసక్తి పెరిగి వాటిపై చర్చించుకునే అవకాశం సైతం ఉంటుంది. బొమ్మలను గీయడంతో ఆవరణ మొత్తం రంగురంగుల బొమ్మలతో నిండుగా పాఠశాల విద్యార్థులను ప్రతిరోజు ఆకట్టుకుంటుంది. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకొస్తే మరిన్ని సౌకర్యాలు కల్పించి బోధన అందిస్తాం.

– ఆశారెడ్డి, పాఠశాల హెచ్ఎం, తాంసి



తరగతి గదుల్లో విజ్ఞానం అందించేందుకు గీసిన చిత్రాలు



పాఠశాల గోడలపై గీసిన చిత్రాలు

కౌలు రైతులను ఆదుకోవాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నేరడిగొండ: కౌలు రైతులను ఆదుకోవాలని రైతు స్వరాజ్యవేదిక ఆధ్వర్యంలో రైతులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ మెనిఫెస్టోలో కౌలు రైతులను గుర్తిస్తామని, రైతు భరోసా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ మొదలు పెట్టలేదన్నారు. గత ప్రభుత్వంలో చట్టం అమలు కాకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: దాబా హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యాజమనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో హోటళ్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. నూనె, ఇతర వంట సామగ్రి నాణ్యతగా ఉండాలన్నారు. కుళ్లిపోయిన చికెన్, మటన్, గుడ్లు నిల్వ ఉంచవద్దని సూచించారు. ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హోటళ్ల యాజమానులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయిస్తేనే విజయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కేవలం ఉన్నత పదవులు పొందడానికే కాదని, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. పరీక్షలు మాత్రమే విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించవని, వారి నడవడిక, ఆత్మవిశ్వాసం అనుకున్నది సాధించేలా చేస్తుందని సూచించారు. తాము ఏంచేస్తున్నామనే విషయంపై ఖచ్చితమైన అభిప్రాయాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి వేసే ప్రతీ అడుగు తాము ఏవైపు వెళ్లాలనేది నిర్ణయిస్తుందన్నారు. చెడు వ్యసనాలు మనల్ని బలహీనులుగా మారుస్తాయని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వామి, ఉపాధ్యాయులు అపర్ణ, సాయిప్రియ, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా ఎన్నికై న జైనూర్ మార్కెట్ కమిటీ సభ్యులు రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికై న జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, వైస్ చైర్మన్ బానోత్‌జైవంత్‌రావు, సభ్యురాలు తొడసం రాధాబాయిలు ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు తీర్మానం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయంలో రాయిసెంటర్ సార్ మెడిలు, తుడుందెబ్బ నాయకులు, గ్రామాల పటేళ్ల సమావేశమయ్యారు. కార్యక్రమంలో నాయకులు పుర్క బాపురావ్, మెస్రం దుర్గు,సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను, కొట్నాక్ దేవ్‌షావ్, హెరేకుమ్ర జుగాదిరావ్, కొట్నాక్ భారిక్‌రావ్, సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, పుర్క చిత్రు, జుగ్నాక్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



గాలికుంటు నివారణ టీకా వేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్‌లో బుధవారం మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ.. రైతులు పశు పోషణకు ముందుకు రావాలని సూచించారు. పశుపోషణతో అధిక లాభాలు ఉన్నాయన్నారు

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ రాయల్‌గార్డెన్ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. ఎనిమిది మందిలో ఐదుగురిని అరెస్టు చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.7200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గుడిహత్నూర్: కూరగాయల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె. రాజశేఖర్, మోహన్‌దాస్, సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తోషం, మాన్కాపూర్, మార్కగూడ గ్రామాల్లో రైతులు పండిస్తున్న టమాట, క్యాబేజీ, మిరప, వంకాయ, కంది పంటల్లో క్షేత్ర పర్యటన నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట రైతులు రాము, దేవిదాస్, కేశవ్‌రావ్ ఉన్నారు.

నేడు ఉద్యోగ జేఏసీ నిరసన

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు జేఏసీ చైర్మన్ సంద అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఉద్యోగులపై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కేంద్ర సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ జేఏసీ సభ్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

బజార్‌హత్నూర్: ధర్మ సమాజ్ పార్టీ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సర్కిల్ నరేశ్, ఉపాధ్యక్షుడిగా పెంట సుధాకర్, సభ్యులుగా సర్కిల్ తరుణ్, పోతరాజు రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి వెంకటేశ్, ఆశన్న, రాజేశ్వర్, మల్లేష్, రవి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కుమ్మరి పోశెట్టి

బోథ్: గత కొన్ని సంవత్సరాలుగా పూర్తి స్థాయి ఎంఈవో లేకపోవడం వల్ల విద్యారంగ సమస్యలు పెరిగిపోయాయని, వాటిని పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. బుధవారం ఎంఈవో కుమ్మరి పోశెట్టికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందించేందుకు తగు సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మున్సిఫ్, నరేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోథ్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఒక విద్యార్థికి దృష్టి లోపం ఉన్నట్టు నిర్ధారించి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వీణ సాగర్, భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని భోయవాడ కాలనీకి చెందిన కోట్నాక్ విజయబాయి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విజయబాయి మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతిపై ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం



వాహన కీ అందిస్తున్న రీజనల్ మేనేజర్

ఆదిలాబాద్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో టీజీబీ ఆదిలాబాద్ మేయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ద్వారా గృహ నిర్మాణ, వ్యాపార, వాహనాల కొనుగోలు కోసం రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంబీ అబీదుల్లా, మేనేజర్ రవిచంద్రరావు, చీఫ్ మేనేజర్ వెంకటస్వామి, రాజేశ్ ఖన్నా, సుబ్బారావు, దేవి, శ్రావణి పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. సేవభావంతో పోటీ చేసేందుకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పలు పోటీ పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుందని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 150 ఫ్యాన్లు అందించానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు హెల్త్‌కార్డులు అందజేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జలేందర్‌రెడ్డి, శ్రీకాంత్, పున్నరావు, పార్థసారథి, సోగలసుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రదర్శనకు ఆదివాసీ కళాకారులు



ఢిల్లీకి బయలుదేరిన ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌కు చెందిన ఆదివాసీ కళాకారుల బృందం బుధవారం ఢిల్లీకి బయలుదేరింది. ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో కాత్లే ఆనంద్, చిట్టిబాబు, శాంతకుమారి తరలివెళ్లారు. బిర్సా ముండా జయంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 13 నుంచి 15 వరకు పార్లమెంట్ హౌస్‌లో వీరు ప్రదర్శన ఇవ్వనున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

నేరడిగొండ: పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసమే గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం 20 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందితే ఆ బిల్లులను తమ దగ్గర సమర్పించి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న రూపావత్ బాబులాల్

నేరడిగొండ: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బలోపేతానికి కృషి చేయాలని మండల అధ్యక్షుడు రూపావత్ బాబులాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా జాతీ సమైక్యత కోసం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం పాటు పడాలన్నారు. ప్రతీనెల తప్పకుండా సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. త్వరలో జరపబోయే జిల్లా కమిటీలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, తదితరులు పాల్గొన్నారు.